కవిత సస్పెన్షన్ సరైనదే !

మేడ్చల్: బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకులపై ధిక్కార స్వరం వినిపిస్తున్న ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం సబబేనని బీఆర్ఎస్ సీనియర్ నేత మద్దుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె అని చూడకుండా పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తుండటంతో పార్టీ నుంచి సస్పెండ్ చేయడం మంచి పరిణామం అన్నారు. పార్టీ కోసం కాకుండా కొందరు స్వలాభం కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. అధిష్టానం పార్టీ కోసం పని చేయని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో కళాశాల విద్యార్థిని వరలక్ష్మి 5 కిలోమీటర్ల పరుగు పందెంలో పసిడి పతకం, 3 కిలోమీటర్ల పరుగు పందెంలో రజతం సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. మరో విద్యార్థి ఉపేంద్ర షాట్‌పుట్ పోటీలో రజతం సాధించాడు.

4న జిల్లాస్థాయి 'కళా ఉత్సవ్' పోటీలు

విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి

సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాస్థాయి 'కళా ఉత్సవ్' పోటీలు ఈనెల 4న ఘట్‌కేసర్ మండలంలోని ఏదులాబాద్ తెలంగాణ సాంఘిక సంక్షేమ లలిత కళల పాఠశాలలో నిర్వహిస్తున్నామని, విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకుని ఈనెల 4న ఉదయం 9.30 గంటలకు పైన తెలిపిన పాఠశాలలో రిపోర్ట్ చేసి జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనాలని ఆమె ఆదేశించారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఉప్పల్: తెలంగాణ మలిదశ ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని మంగళవారం తెలంగాణ ఉద్యమకారులు ప్రసాద్, కొర్ర కృష్ణనాయక్, చిలుకపాటి పవన్‌కుమార్‌లు ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు సంక్షేమ పథకంలో భాగంగా 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఓరియంటేషన్

ఉప్పల్: లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం మొదటి సంవత్సరం వలంటీర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధాన వక్తగా ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యాసాగర్ హాజరై వలంటీర్లకు ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను వివరించారు. 'నాట్ మీ బట్ యూ' అనే ఎన్ఎస్ఎస్ మోటోను ప్రతిపాదిస్తూ.. యువత దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. సేవా దృక్పథం, నాయకత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ జాన్ కలరక్కల్, ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, గణితశాస్త్రం విభాగ అధ్యాపకుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీరేదెన్నడో ?

ఆపదలో ఉన్న వారి బలహీనతే పెట్టుబడి

- అధిక లాభాలు ఆర్జిస్తున్న వడ్డీ వ్యాపారులు
- అసలు తీర్చలేక నిరుపేదల అవస్థలు

జవహర్‌నగర్: ప్రైవేట్ వ్యాపారులు వడ్డీ వ్యాపారం పేరుతో ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆపదలో ఉన్న వారి బలహీనతలను ఆసరగా చేసుకుని లాభాలు గడిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



రూ.50 లక్షలకు పైగా లావాదేవీలు..

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో వడ్డీ వ్యాపారం 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా కొనసాగుతోంది. కేవలం జవహర్‌నగర్‌లోనే ప్రతిరోజూ సుమారు రూ.50 లక్షలకు పైగా లావాదేవీలు సాగుతున్నాయని అంచనా. ఫైనాన్స్, చిట్టీల పేరుతో మరికొందరు వడ్డీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు.

చిరువ్యాపారులే అధికంగా అప్పు..

కూలీలు రోజూవారీ, నెలవారీ పద్దులు తీసుకుంటున్నారు. చిరు వ్యాపారులైతే రూ.లక్షల్లో అప్పులు తీసుకుంటున్నారు. మధ్యతరగతి వారే ఈ వడ్డీ వ్యాపారుల ఊబిలో చిక్కుకుంటున్నారు. దినసరి ఆదాయం కూలీలు, వ్యాపారులు తమ కుటుంబాలను పోషించుకునేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోజంతా చెమటోడ్చి సంపాదించిన డబ్బు కడుపునింపుకోవడానికే సరిపోతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగంగానే వ్యాపారాలు..

పట్టణంలో వేలాది మంది గిరిగిరిపై ఆధారపడుతున్నారు. ఇది వడ్డీ వ్యాపారులకు వరంగా మారింది. గిరిగిరి వడ్డీ వ్యాపారాలు బహిరంగంగానే సాగుతున్నాయి. వీటి వల్ల తలెత్తే వివాదాలతో పోలీస్‌స్టేషన్‌లో ఎన్నో కేసులు నమోదైనట్లు సమాచారం. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా సాగిస్తున్న ఈ దందాను అరికట్టి పేద, మధ్యతరగతి వారిని ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆపదొస్తే వడ్డీ వ్యాపారులే దిక్కు..

నిరుపేదలకు ఎప్పుడైనా అనుకోని ఆపద వచ్చినప్పుడు నిరుపేదలందరూ.. చాలా వరకు వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. ముందే 10 శాతం డబ్బులను వడ్డీ కింద జమచేసుకుని డబ్బును అందజేస్తున్నారు. వంద రోజుల పాటు రోజూ వారీగా అప్పు వసూలు చేసుకుంటున్నారు. అయితే ఈ వడ్డీ వ్యాపారుల వలలో చిక్కిన వారు ఎన్నటికీ విముక్తి పొందలేరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల పాలవుతున్నాం..



అత్యవసర సమయంలో ప్రైవేటు వడ్డీ రుణాలపై ఆధారపడాల్సి వస్తుంది. వడ్డీ ఎంత అనేది చూడకుండానే అప్పులు తీసుకుంటున్నారు. దీన్ని ఆసరగా చేసుకుని వ్యాపారులు వడ్డీ మీద వడ్డీ వసూలు చేస్తున్నారు. దీంతో అప్పులు తీరడం లేదు.

– ప్రభాకర్, బాలాజీనగర్

అసలు తీరేదెన్నడో..?



గిరిగిరి నెలవారీ వడ్డీలకు అప్పులు తీసుకుని ఎంతో మంది అవస్థలు పడుతున్నారు. అధిక వడ్డీలు ఉండటంతో వాటిని చెల్లించడంతోనే కాలం గడుస్తుంది. ప్రస్తుత రోజుల్లో పూట గడవడమే కష్టంగా మారింది. అసలు అలాగే ఉండి, ఒకరి అప్పు తీర్చేందుకు మరొకరి దగ్గర అప్పు తీసుకొస్తున్నారు.

– యాదగిరి, జవహర్‌నగర్

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



పేద ప్రజల అవసరాలను ఆసరగా చేసుకుని కొంత మంది ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులు వడ్డీకి తీసుకున్న వారి ఇళ్లలు లూటీ చేస్తున్నారు. ప్రజలు వారి మాటలు నమ్మి మోసపోవద్దు. అధిక వడ్డీలు ఇచ్చి పేదలను వేధిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– యాదయ్య, ఇన్‌స్పెక్టర్, జవహర్‌నగర్

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

పోచారం: వెంకటాపూర్‌లోని నాడెం చెరువులో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఈ ఏర్పాట్లను డీసీపీ పద్మజ మంగళవారం పరిశీలించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఈ సందర్భంగా ఆదేశించారు. ఏసీపీ చక్రపాణి, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, ఇన్‌స్పెక్టర్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, బిల్ కలెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



నాడెం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ పద్మజ

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు

ఎస్సీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాల్లో భాగంగా ఖాళీగా ఉన్న 21 సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ (డే స్కాలర్) పాఠశాలల్లో ప్రవేశం కోసం 5 నుంచి 6 ఏళ్ల లోపు ఉన్న షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అభ్యర్థులు జిల్లా వాస్తవ్యులై ఉండాలని, నివాసం, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు మీ- సేవ ద్వారా పొందాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ.5.20 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండాలని సూచించారు. ఒక్క కుటుంబం నుంచి ఒక్క విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద అవకాశం ఉంటుందని, విద్యార్థి వయస్సు ఒకటి జూన్ 2025 నాటికి 5 నుంచి 6 ఏళ్లు ఉండాలని తెలిపారు.

◆ మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 5న సాయంత్రం 4 గంటలలోపు నేరుగా అందించాలని కోరారు. జిల్లాలోని ఆర్ఎస్ ఉన్నత పాఠశాల (చింతల్), బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల (కుషాయిగూడ), బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల(కూకట్‌పల్లి), పద్మశ్రీ ఉన్నత పాఠశాల(బోడుప్పల్), నార్త్ సిటీ హైస్కూల్(సూరారం), కష్ణవేణి ఉన్నత పాఠశాల, (మల్కాజిగిరి), శ్రీ విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల(తూంకుంట), శ్రీ సాయి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల(జగద్గిరిగుట్ట)ల్లో ప్రవేశాలు ఉన్నట్లు వినోద్‌కుమార్ వివరించారు.

అన్నదానం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో వినాయక చవితి నవరాత్రి వేడుకలు మంగళవారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌సీనగర్ డైమాండ్ యూత్ మండపం వద్ద డైమాండ్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. సుమన్, బాబురావు, సాయికిరణ్, నాగరాజు, సంపత్, శశాంక్, దిలీప్, వెంకటేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పూజలు.. జోరుగా నిమజ్జనాలు



రాఘవేంద్రనగర్ వినాయక మండపం వద్ద కుంకుమార్చన



మేడ్చల్ పెద్ద చెరువులో నిమజ్జనానికి బొజ్జ గణపయ్య

మేడ్చల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఉత్సవాలు జోరుగా కొనసాగుతున్నాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద జోరుగా సాయంత్రం పూజలు చేస్తున్నారు. కుంకుమార్చనలు, హోమాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు. మరోవైపు చిన్న చిన్న వినాయక విగ్రహాలను మేడ్చల్ పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జనం కోసం పెద్ద చెరువు, సూతారిగూడ వద్ద అధికారులు, పోలీసులు అన్ని రకాల ఏర్పాట్లను సమీక్షించారు.



బాసిరేగడిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



డబీల్‌పూర్‌లో..

బన్సీలాల్ వ్యాస్‌కి ఘన నివాళి

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ జూనియర్ కళాశాల, గురుకుల్ పాఠశాల వ్యవస్థాపకుడు దివంగత బన్సీలాల్ వ్యాస్‌జీ వర్ధంతిని ఘట్‌కేసర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యలో పేదలు వెనకబడొద్దని స్వాతంత్ర్యానికి పూర్వమే వందలాది ఎకరాల భూమిని కొనుగోలు చేసి గురుకుల్ ట్రస్టుకు అప్పగించాడని పేర్కొన్నారు. గురుకుల్ పాఠశాల ప్రిన్సిపాల్ రజిని, రవిశంకర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



మహానేతకు ఘన నివాళి

మేడ్చల్ జోన్ పరిధిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన విగ్రహం, చిత్రపటాలకు నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆరోగ్యశ్రీ, పెన్షన్ పెంపు తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

– మేడ్చల్ జోన్ బృందం



మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



అంకుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



దేవరయాంజాల్‌లో..



కీసరలో..

రూ. 1.84 కోట్లతో అభివృద్ధి పనులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ.1.84 లక్షలతో అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. బీరప్పగడ్డ లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఎదురుగా డ్రైనేజీ పైపులైన్ పనులు, ధర్మపురి కాలనీ ముఖద్వారం వద్ద డ్రైనేజీ పైపులైన్, సాయిరాంనగర్ కాలనీ వద్ద డ్రైనేజీ పైపులైన్, రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిలుకానగర్ డివిజన్‌తో పాటు అన్ని డివిజన్లను అదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. అధికారులు ప్రజా సమస్యల విషయంలో ఎక్కడ అలసత్వం వహించినా.. సహించేది లేదన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో గాయపడిన వారిని ఆదుకోవాలి

ఉప్పల్: రామంతాపూర్ విద్యుదాఘాతానికి గురైన బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే తహసీల్దార్ అందుబాటులో లేనందున ఆర్ఐతో మాట్లాడారు. గాయపడిన జాబితాలో వెంకటరమణను చేర్చాలని అధికారిని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గాయపడిన వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, వారు కోలుకునే వరకు ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

అల్వాల్: మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్వాల్‌లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి నివాసం వద్ద కేక్‌కట్ చేసి వేడుకలు చేశారు.

◆ సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో అల్పాహారం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. నాయకులు పవన్‌కుమార్, శ్రీనివాసులు, సూర్యప్రకాష్‌రెడ్డి, డోలి రమేష్, శంకర్, రాజు తదితరులున్నారు.

మల్కాజిగిరి: సఫిల్‌గూడలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వి.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరిగాయి. అనంతరం ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు వెంకన్న, మురుగేష్, చిన్నాయాదవ్, గుత్తి చందు తదితరులున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వ తీరును నిరసిస్తూ..

బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

మేడ్చల్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ అంటూ.. ప్రభుత్వం సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ.. మేడ్చల్‌లో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ నేతలు మంగళవారం మేడ్చల్‌లో నిరసన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు. బీఆర్ఎస్ నేతలు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, సుదర్శన్, రాజమల్లారెడ్డి, జగన్‌రెడ్డి, దయానంద్‌యాదవ్ నవీన్‌రెడ్డి, ఈశ్వరయ్య, సందీప్‌గౌడ్, రందీప్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, నాగరాజు, హేమంత్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో నిరసన చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కీసర/జవహర్‌నగర్: కాళేశ్వరంపై కాంగ్రెస్ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో ధర్నా చేశారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ నేతలు ధర్నా చేపట్టారుఅనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ మేయర్ కావ్య, పార్టీ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో ధర్నా చేస్తున్న మాజీ మేయర్ కావ్య తదితరులు



రాంపల్లి చౌరస్తాలో...

కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసే కుట్ర

ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



ఉప్పల్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: సీబీఐ విచారణ పేరుతో తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసి వేసే కుట్ర జరుగుతోందని, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు మంగళవారం ఉప్పల్ చౌరస్తాలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు, కార్పొరేటర్లు వరంగల్ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టేందుకే సీబీఐ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందన్న రేవంత్‌రెడ్డి మాట మార్చి కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ఎలా..? అప్పగించారని ప్రశ్నించారు. సీబీఐ సహా ఎలాంటి విచారణనైనా ఎదుర్కొంటామని, కాంగ్రెస్, బీజేపీల కుట్రలను తిప్పికొడతామన్నారు. బీఆర్ఎస్‌కు కేసులు కొత్త కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ఉప్పల్ కాప్రా సర్కిల్ బీఆర్ఎస్ నేతలు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మేడిపల్లి: తెలంగాణ నేలలో పచ్చని పైరులతో పులకించేలా చేసిన ఘనత కేసీఆర్‌దేనని, తెలంగాణ కలల పంట కాళేశ్వరం అని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, మహేష్‌గౌడ్,మాధవి, రఘుపతిరెడ్డి, మనోరంజన్‌రెడ్డిలతో కలిసి నల్ల బ్యాడ్జీలతో రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణలో లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందుబాటులోకి వచ్చి పంటలు సంమృద్ధిగా పండి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కేసీఆర్‌పై విషం కక్కుతున్న కాంగ్రెస్ నేతలను తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. సరైన సమయంలో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



పీర్జాదిగూడ బీఆర్ఎస్ కార్యాలయం వద్ద..